సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



పోటెత్తిన మద్ది క్షేత్రం
జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలకు భక్తులు పోటెత్తారు. ఒక్కరోజు ఆదాయం రూ.3.65 లక్షలు వచ్చింది.



ఇల వైకుంఠం
ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం, శనివారం కావడంతో వేలాదిగా తరలివచ్చారు. దీంతో క్షేత్రంలో అన్ని విభాగాలు కిక్కిరిశాయి.



శ్రీవారి పథకాలకు విరాళం
ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న దేవస్థానంలో పలు పథకాలకు ఎస్.రాజ్‌కుమార్ (హైదరాబాద్) దంపతులు రూ.2.50 లక్షలు విరాళంగా అందజేశారు.

రైతులకు నిండైన మద్దతు

'వరి'వడిగా కొనుగోళ్లు

- పంట నష్టం నుంచి రైతులను ఆదుకునేందుకు చర్యలు
- జిల్లాలో ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు
- మద్దతు ధరలు కల్పిస్తూ భరోసా
- తేమశాతం పెరిగినా కొనుగోలుకు వెసులుబాటు



కాళ్ల మండలం పెదఅమిరంలో ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

మద్దతు ధరలు (75 కిలోల బస్తా)
సాధారణ రకం రూ. 1,637
ఏ గ్రేడ్ రకం రూ. 1,652

సాక్షి, భీమవరం: పంట చేతికందే దశలో మిచాంగ్ తుపాను విలయంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతను గట్టెక్కించే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. పొలాల్లో ముంపునీటి తొలగింపునకు సహాయక చర్యలు కొనసాగిస్తూనే ధాన్యం సేకరణ ముమ్మరం చేసింది. నాసిరకం పేరిట రైతులు దోపిడీకి గురికాకుండా రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లి ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటున్నారు.

2.13 లక్షల ఎకరాల్లో..

జిల్లాలోని 2.13 లక్షల ఎకరాల్లో రైతులు సార్వా పంటను సాగుచేయగా తుపాను వచ్చే నాటికి 1.05 లక్షల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. మాసూళ్లు జరిగిన మేర 2.10 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ధాన్యం కొనుగోలుకు జిల్లాలో 314 ఆర్‌బీకేలను ఏర్పాటుచేశారు. పట్టుబడి కోసం 55 లక్షల గోనె సంచులు సిద్ధం చేశారు. తుపాను మొదలయ్యే నాటికి 1.02 లక్షల టన్నుల ధాన్యం సేకరించగా, 48 వేల టన్నుల ధాన్యాన్ని రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకున్నారు. అయితే తుపానుతో రైతులు నష్టపోకుండా అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం అప్రమత్తం చేసి యుద్ధప్రాతిపదికన ధాన్యం సేకరణ లక్ష్యంగా నిబంధనలకు సడలింపులు ఇచ్చింది. ఆఫ్‌లైన్ ద్వారా కొనుగోలుకు వెసులుబాటు కల్పించడంతో పాటు జీపీఎస్ లేకపోయినా రైతులు తమ సొంత వాహనాల్లో సమీపంలో తమకు నచ్చిన మిల్లులకు ధాన్యాన్ని తరలించుకునే వీలు కల్పించింది. ప్రభుత్వ తోడ్పాటుతో కొనుగోలు కేంద్రాల సిబ్బంది నేరుగా కల్లాల్లోకి వెళ్లి ఒక్కరోజులోనే 23,500 టన్నుల ధాన్యాన్ని సేకరించారు.

రైతులు దోపిడీకి గురికాకుండా..

కనీస మద్దతు ధర సాధారణ రకం 75 కిలోల బస్తా రూ.1,637, గ్రేడ్ ఏ రకానికి రూ.1,652లు ప్రభుత్వం అందిస్తోంది. తుపాను విలయంతో దెబ్బ తిన్న రైతులకు అండగా ధాన్యంలో తేమశాతం పెరిగినా సేకరణకు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలిచ్చారు. వ్యవసాయ, సివిల్ సప్లయిస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తడిసిన ధాన్యం, నీటమునిగిన పంటను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. నాసిరకం పేరిట రైతులు దళారులు దోపిడీకి గురికాకుండా సొసైటీ, పీపీసీ సిబ్బంది పొలాలు, కల్లాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. గత రెండు రోజుల్లో 25 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు.

సహాయక చర్యలు ముమ్మరం

వాతావరణం తెరిపిచ్చినా వరద నీటితో జిల్లాలోని ప్రధాన డ్రెయిన్లు, ఎర్రకాలువ పోటెత్తి పొలాల్లో ముంపునీరు లాగక రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మూడు రోజులుగా వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు పొక్లయిన్లతో కాలువల్లో పూడిక తీయించడం, ఆయిల్ ఇంజన్ల ద్వారా పొలాల్లోని నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధి కూలీలను వ్యవసాయ పనులకు వినియోగిస్తున్నారు. మూడు రోజుల్లో నాలుగు వేలకు పైగా కూలీలు పంట బోదెల్లో పూడిక తీత పనుల్లో పాల్గొన్నట్టు డ్వామా పీడీ తెలిపారు.

మార్గదర్శకాలిలా..

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వ్యర్థాలు, మట్టి, రాళ్లు ఒక శాతం వరకు, చెత్త, తాలు ఒక శాతం వరకు, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం ఐదు శాతం వరకు, ముడుచుకుపోయిన, వంకర తిరిగిన ధాన్యం మూడు శాతం వరకు, తేమ 17 శాతం వరకు, గ్రేడ్–1లో కేళీలు ఆరు శాతం వరకు ఉండవచ్చు.

అన్నదాతలకు అండగా..

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రైతులకు అన్నివిధాలా అండగా ఉంటూ ధాన్యం కొనుగోలు వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 1.45 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాం. కలెక్టర్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి సూచనలిస్తున్నారు.
– టి.శివరామప్రసాద్, సివిల్ సప్లయిస్, డీఎం



ఆకివీడు మండలం దుంపగడపలో కల్లం వద్దకు వెళ్లి ధాన్యం సేకరిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది



ఇరగవరం మండలం కాకిలేరులో సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ వెంకటేశ్వరరావు

5 వేల ఎకరాల్లో ముంపు నీరు తొలగింపు

తుపాను ప్రభావంతో 29,700 ఎకరాలు ముంపు బారిన పడగా చేపట్టిన ఆయా నష్టనివారణ చర్యలతో దాదాపు ఐదు వేల ఎకరాల్లో నీటిని తొలగించినట్టు వ్యవసాయశాఖ జేడీ వెంకటేశ్వరరావు చెప్పారు. నష్టనివారణ చర్యలను కలెక్టర్ ప్రశాంతి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు. తడిసిన ధాన్యం మొలకలు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని, ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడం ద్వారా రైతులకు త్వరితగతిన నగదు చెల్లింపులకు మార్గం సుగమం చేయాలని సూచిస్తున్నారు. ధాన్యం సేకరణలో ఎటువంటి ఫిర్యాదులు, సమస్యలు రాకుండా సమర్థవంతంగా పనియాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. వాతావరణం తెరిపిచ్చి మూడు రోజులుగా ఎండలు కాస్తుండటంతో ఎక్కడ చూసినా కల్లాల్లోని ధాన్యాన్ని ఆరబెట్టుకోవడం, పొలాల్లో ముంపునీరు బయటకు పోయేందుకు బాటలు చేసుకునే పనిలో రైతులు నిమగ్నమై ఉన్నారు.

అన్నివిధాలా ఆదుకుంటాం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



దర్శిపర్రులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): తమది రైతు ప్రభుత్వమని, అన్నదాతలను అన్నివిధాలా ఆదుకుంటామని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో దెబ్బతిన్న పంటలను శనివారం ఆయన పరిశీలించారు. దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల, రావిపాడు, బి.కొండేపాడు, మీనవల్లూరు, మారంపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి నీటిలో నానుతున్న వరి పొలాలు, తడిసిన ధాన్యం, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం ఆఫ్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఇప్పటికే చాలామంది రైతులు సద్వినియోగం చేసుకున్నారని, మిగిలిన వారు కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. ధాన్యం గింజలను పరిశీలించిన మంత్రి ఆఫ్‌లైన్‌లో మిల్లులకు పంపాలన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఆఫ్‌లైన్ విధానం ఎంతో ఉపయుక్తంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. రామచంద్రపురంలో యనమదుర్రు కాలువ ఎడమ గట్టును ఆనుకుని ఐదు తలల మెట్ట పొలాల్లో ఎర్రకాలువ ఉధృతికి నిండా మునిగిన వరి చేలను ఆయన పరిశీలించి పంటల బీమా వర్తించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడతానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్లు శివశంకర్ ప్రసాద్, శేషగిరిరావు, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా చైర్మన్ కైగాల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, సొసైటీల చైర్మన్లు గుండుమోగుల సాంబయ్య, కైగాల గణపతి, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, గుమ్మల్ల తాతారావు, జెడ్పీటీసీలు ముత్యాల ఆంజనేయులు, ఉప్పులూరు వరలక్ష్మి, ఎంపీపీలు దాసరి హైమావతి, పి.శేషులత, ఎంపీటీసీ నిరీక్షణరావు ఉన్నారు.

న్యూస్‌రీల్

క్షీరారామంలో మంత్రి రోజా పూజలు



మంత్రి రోజాను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని పర్యాటక శాఖ మంత్రి రోజా శనివారం సందర్శించారు. ముందుగా ఆమెకు ఆలయ అధికారులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. ఆలయంలో గణపతి పూజ చేసిన అనంతరం క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్దనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లను ఆమె దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి అభిషేక మండపంలో పండితులు వేద ఆశీర్వచనం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శుక్రవారం అమరావతి అమరేశ్వరస్వామిని దర్శించుకుని శనివారం ద్రాక్షారామం, సామర్లకోట పంచారామాలను దర్శించుకుని ఇక్కడకు వచ్చానన్నారు. ఇక్కడ నుంచి భీమవరం వెళతానన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఈ ఆలయానికి వచ్చానని, ఇప్పుడు మంత్రిగా స్వామిని దర్శించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రానికి మరో 30 ఏళ్లపాటు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగాలని స్వామివారిని కోరుకున్నట్టు చెప్పారు. తిరుమల తిరుపతిలో అన్నదానంపై వస్తున్న కామెంట్లు తలాతోక లేకుండా సోషల్ మీడియాలో చేస్తున్న ఫేక్ న్యూస్‌లన్నారు. ఆలయంలో సామాన్యుడికి ఉచిత దర్శనం సక్రమంగా అందించాలనే ఉద్దేశంతో బ్రేక్ దర్శనాలు ఉదయం 10 గంటలకు ఏర్పాటుచేస్తున్నారని చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు, దెందులూరు నియోజకవర్గ పరిశీలకుడు యడ్ల తాతాజీ, ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

మావుళ్లమ్మ దర్శనం నిలిపివేత



గర్భగుడిని మూసివేసిన దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): 60వ వార్షిక మహోత్సవాల కోసం భీమవరం మావుళ్లమ్మవారి దేవస్థానంలో గర్భగుడిని శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో కళాపకర్షణ జరిపి మూసివేశారు. తిరిగి ఈనెల 28న ఉదయం 11 గంటలకు కళాన్యాసం జరిపి అమ్మవారి మూల విరాట్ దర్శనం పునః ప్రారంభమవుతుందని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ ధికారి యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. వచ్చే నెల 13 నుంచి అమ్మవారి వార్షిక మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు ముత్యాల రామారావు, రామాయణం సత్యనారాయణ, మావూరి సుందరరావు, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, గోపిశెట్టి విజయలక్ష్మి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

ఏలూరు (టూటౌన్): కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రెండో జిల్లా జడ్జి పి.మంగాకుమారి కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు.

1,957 కేసుల పరిష్కారం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 1,957 కేసులను పరిష్కరించారు. 139 సివిల్ కేసులు, 111 వాహన ప్రమాద బీమా కేసులను రాజీ చేశారు. దీని ద్వారా రూ.7 కోట్ల 37 లక్షల 35 వేలను కక్షిదారులకు పరిహారంగా చెల్లించారు.

సర్వం శివోహం.. లక్ష దీపోత్సవం

పాలకొల్లు సెంట్రల్ : పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని లక్ష దీపోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం 6 గంటలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) దంపతులు దీపాలంకరణను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణం, ప్రాకారం చుట్టూ, వెనుక భాగంలో భక్తులు దీపాలు వెలిగించారు. శివలింగం, గణపతి ఆకృతుల్లో దీపాలంకరణ ఆకట్టుకుంది. ఆలయంలో క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్దన స్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వైఎస్సార్ సీపీ నేత యడ్ల తాతాజీ, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టు బోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయ ప్రాంగణంలో దీపాలంకరణలు



ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి

ఉదారంగా పంట నష్టం అంచనాలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పంట బాగా పండి చేతికొచ్చే వేళ మిచాంగ్ తుపాను రైతులను దెబ్బతీసిందని, పంట నష్టం అంచనా వేసే క్రమంలో అధికారులు ఉదారంగా వ్యవహరించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం తణుకు నియోజకవర్గ పరిధిలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకుండా చివరి గింజ వరకు కొనుగోలు చేసి డబ్బులు ఖాతాల్లో వేయాలని సీఎం జగన్ ఆదేశించారన్నారు. పంట నష్టం అంచనా వేసే సమయంలో రైతులకు మేలు చేసేలా వ్యవహరించాలన్నారు. పంట కోత ప్రయోగాలు పూర్తయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందని, కోతలు పూర్తికాని పంట ఉంటే బీమా వర్తింపజేసేలా చూడాలని ఆదేశించారు. రైతులు సమీపంలోని మిల్లులకు ధాన్యం తరలించవచ్చని, రైసుమిల్లర్లు ఇబ్బంది పెడితే ఉపేక్షించమని హెచ్చరించారు. ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు రూ.17 వేలతోపాటు బీమా కూడా రాజీ లేకుండా చేయిస్తామని స్పష్టం చేశారు.

80 శాతం రాయితీతో విత్తనాలు

నారుమడులు దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీతో విత్తనాలు సరఫరా చేస్తామని మంత్రి కారుమూరి చెప్పారు. చంద్రబాబు హయాంలో తుపాన్లు ఏర్పడ్డ సమయంలో నిధుల కేటాయింపులో తీవ్ర జాప్యం ఉండేదని, అయితే సీఎం జగన్ తుపాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున నిధులు అందించారన్నారు. మురుగు, పంట కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధికి అధికారులు ముందస్తు ప్రణాళికలకు అనుగుణంగా టెండర్ ప్రక్రియలు పూర్తిచేయాలన్నారు. తణుకు నియోజకవర్గంలో 29,500 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇందులో ఆఫ్‌లైన్ సేకరించింది 8 వేల టన్నుల వరకు ఉందన్నారు. సివిల్ సప్లయిస్ డీఎం టి.శివరామప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఈఈ దక్షిణమూర్తి రైతులు, నాయకుల సందేహాలను నివృత్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, ఎంపీపీ ఆర్.ధనరాజు, అత్తిలి జెడ్పీటీసీ అడ్డాల జానకి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలకు తూట్లు

- రోగి నుంచి సొమ్ముల వసూలు
- తణుకులో కార్పొరేట్ ఆస్పత్రి నిర్వాకం



రోగి వద్ద రూ.5 వేలు కట్టించుకున్న బిల్లు

తణుకు అర్బన్: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా ఉన్నత వైద్యం అందించాలనే ప్రభుత్వ ఆశయానికి కొన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు గండి కొడుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్రచికిత్స చేయించుకున్నా డబ్బులు గుంజుతున్నాయి. ఇదే తరహా సంఘటన తణుకులో చోటుచేసుకుంది. బాధితురాలు తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన ఎస్‌టీ మహాలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. ఆమెకు కిడ్నీలో రాళ్లు ఉన్నాయని గతనెల 22న తణుకు రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆపిల్ ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు రెండు సార్లు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. అయితే రెండు ఆపరేషన్లకు కలిపి మత్తు ఇచ్చేందుకు రూ.10 వేలు అవుతుందన్నారు. దీంతో ఆమె పట్టణానికి చెందిన ఐఎంఏ వైద్యుడిని సంప్రదించగా సొమ్ములు ఏమీ ఇవ్వాల్సిన అవసరం లేకుండానే గతనెల 24న ఆమెకు ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స చేశారు. రెండోసారి శస్త్రచికిత్స కోసం ఆమె ఈనెల 6న మరలా ఆస్పత్రికి వెళ్లగా.. ఆపరేషన్ అవసరం ఉండదని, మందులతో నయమవుతుందని అక్కడి సిబ్బంది అన్నారు. అయితే మొదటిసారి ఆపరేషన్ చేసిన సమయంలో వేసిన ట్యూబు (స్టంట్) తీసేందుకు రూ.5 వేలు ఇవ్వాలని అడిగారు. దీంతో ఆమె రూ.5 వేలు చెల్లించి ట్యూబు తీయించుకున్నారు. దీనిపై ఆస్పత్రి ప్రతినిధి బ్రహ్మాజీని వివరణ కోరగా ట్యూబు తీయించుకునేందుకు మరలా ఆరోగ్యశ్రీ వార్డులో చేరాలని, అప్రూవల్ వచ్చేందుకు మూడు రోజులు సమయం పడుతున్న కారణంగా ఈ రకంగా డబ్బులు తీసుకుని చేస్తున్నట్టు చెప్పారు. అలాగే ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులకు తెలియజేస్తానని అన్నారు.

11న అప్రెంటీస్ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 11న అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్టు ఐటీఐ కళాశాల ప్రధానాధికారి పి.రజిత ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే మేళాలో చెన్నై, తెలంగాణ, ఏలూరు జిల్లాలోని ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులతో పాటు ఐటీఐ డిప్లొమా లేదా ఏదైనా వృత్తి విద్య కోర్సు చేసిన వారు అర్హులని తెలిపారు.

వరి కోత యంత్రం అపహరించిన ఇద్దరి అరెస్టు

భీమడోలు : వరి కోత యంత్రాన్ని అపహరించిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు భీమడోలు సీఐ బీబీ రవికుమార్, ఎస్సై చావా సురేష్‌కుమార్ చెప్పారు. శనివారం వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కురెళ్లగూడెంలో గత నెల 30వ తేదీ రాత్రి వరి కోత యంత్రం దొంగతనానికి గురైందని నెల్లూరుకు చెందిన యంత్రం యాజమాని షేక్ షాకీర్ అహ్మద్ ఈనెల 3వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. చింతలపూడి మండలం అల్లిపల్లి గ్రామానికి చెందిన కొల్లూరి అశోక్, కర్నాటి నవీన్ వరి కోత యంత్రాన్ని దొంగిలించినట్లు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించి పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. చింతలపూడి మండలం అల్లిపల్లికి చెందిన కొల్లూరి అశోక్ వరి కోత యంత్రం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే యంత్రం తరచూ మరమ్మతులకు గురై నష్టాలు రావడంతో అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చలేక ఏదైనా వరి కోత యంత్రం దొంగిలించాలని నిర్ణయించుకుని తన స్నేహితుడైన కర్నాటి నవీన్‌తో కలిసి తణుకు, తాడేపల్లిగూడెం, భీమడోలులో గాలించారు. అలా కురెళ్లగూడెం శివారు పొలాల్లో కోత యంత్రాన్ని చూసి ఎవరూ లేని సమయంలో గత నెల 30వ తేదీ అర్ధరాత్రి మినీ వ్యాన్‌లో యంత్రాన్ని ఎక్కించి ద్వారకాతిరుమలలోని నిర్మానుష్య ప్రాంతంలో దాచారు. అక్కడ నుంచి వేరే ప్రాంతానికి తరలిస్తుండగా సమాచారం అందుకున్న భీమడోలు సీఐ బీబీ రవికుమార్ నిందితులిద్దరిని శనివారం అదుపులోకి తీసుకుని వారి నుంచి యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును చేధించిన సీఐ బీబీ రవికుమార్, ఎస్సై చావా సురేష్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ సూరిశెట్టి శ్రీనివాస రావు, కానిస్టేబుల్ అబ్దుల్ మజీద్‌లను ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసరావు అభినందించారు.



యంత్రం, నిందితులతో సీఐ బీబీ రవికుమార్, ఎస్సై చావా సురేష్‌కుమార్

బాలుడి చికిత్సకు రూ.10 లక్షల సాయం

భీమడోలు: అరుదైన బోన్‌మ్యారో వ్యాధితో బాధపడుతున్న ఓ బాలుడికి చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయించి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు బాధిత కుటుంబాన్ని ఆదుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరుకు చెందిన ఆరేళ్ల బాలుడు కుమార్ హరి సూర్యాచందన్ కొంతకాలంగా బోన్‌మ్యారో వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యులను సంప్రదిస్తే చికిత్స కోసం రూ.10 లక్షల ఖర్చు అవుతుందని తల్లి పావనికి తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో భర్త మృతి చెందగా, పుట్టెడు దుఃఖంతో ఉన్న ఆమె బిడ్డకు వచ్చిన అరుదైన వ్యాధితో మరింత కుంగిపోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన పావని తన కుమారుడిని ప్రాణాలతో రక్షించుకునేందుకు ఏం చేయాలో పాలుపోక దిక్కుతోచని స్థితిలో ఉంది. దీనితో స్థానిక వైఎస్సార్ సీపీ నేతల సహకారంతో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు వద్దకు తన బిడ్డను తీసుకుని వెళ్లి సమస్యను చెప్పి కన్నీటిపర్యంతమైంది. దీంతో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మానవత్వంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి తక్షణమే బాలుడికి ఆపరేషన్‌తో పాటు వైద్య చికిత్స కోసం రూ.10 లక్షలను సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేయించారు. భువనపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే వాసుబాబు శనివారం పావనికి రూ.10 లక్షల ఎల్‌వోసీ ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. బిడ్డ ఆరోగ్యంపై ఆందోళన చెందవద్దని, వైద్య ఖర్చుల కోసం కంగారుపడవద్దని వాసుబాబు ఆమెకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వాసుబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నకిలీ సర్టిఫికెట్లతో టెక్నీషియన్లుగా ఉద్యోగాలు

ఇద్దరిపై ఏలూరు టూటౌన్‌లో కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మెడికల్ కళాశాల, వైద్య విధాన పరిషత్‌లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ కాగా, వాటిలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన ఇద్దరిపై ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 2022 ఆగస్టులో ఆడియో మెట్రిక్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కాగా ఏడాదిపాటు నోటిఫికేషన్ అమల్లో ఉంటుందని, అర్హతల ఆధారంగా ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. పలుమార్లు ప్రకటనలు చేసినా ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవటంతో దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు ఈ శాఖల్లోని ఉద్యోగులు అర్హత లేకున్నా నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాల్లో చేర్పించినట్లు తెలుస్తోంది. వైద్య విధాన పరిషత్‌లో ఖాళీగా ఉన్న 5 ఆడియో మెట్రిక్ టెక్నీషియన్ పోస్టులకు నకిలీ సర్టిఫికెట్లతో ఐదుగురు వ్యక్తులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ శాఖలోని ఒక ఉద్యోగి కీలకంగా వ్యవహరించి ఐదుగురికి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు వచ్చేలా చేశారని చెబుతున్నారు. దీనిపై గతంలో ఆ శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్ళినా వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులు ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేయటంతో ఆయన ఆదేశాలతో ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాలతో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్‌సతీష్‌కుమార్ ప్రస్తుతం ఈ ఉద్యోగాల్లో చేరిన ఇద్దరు వ్యక్తులపై ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో కేసు ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. తాడేపల్లిగూడెం ఏరియా హాస్పిటల్‌లో ఆడియో మెట్రిక్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న వీర నరేష్, చింతలపూడి ప్రభుత్వ హాస్పిటల్‌లో ఆడియో మెట్రిక్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న మిత్రానందంపై ఏలూరు టూటౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మరో ముగ్గురు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినా ఉద్యోగాల్లో చేరలేదని అధికారులు స్పష్టం చేశారు. ఇంకా ఎవరైనా నకిలీ సర్టిఫికెట్లుతో ఉద్యోగాలు పొందారా అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

నరసాపురం రూరల్: కొత్తపాలెంలో రోడ్డుపై నడిచి వెళుతుండగా కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మొగల్తూరు ఎస్సై ఎం.వీరబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మొగల్తూరు మండలం కొత్తపాలెంకు చెందిన ఉన్నమట్ల పెద్దిరాజు (37) శనివారం ఇంటి నుంచి గ్రామ కూడలి వద్దకు నడుచుకుంటూ వెళుతున్నాడు. ఇంతలో ఓ కారు వేగంగా ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై పెద్దిరాజును గ్రామస్తులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలు

ఇరగవరం: దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ఓ నిందితుడికి 14 నెలల జైలు శిక్ష విధిస్తూ తణుకు కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు శనివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ఏటి మొగ గ్రామానికి చెందిన పొన్నాడ రవిశంకర్ అలియాస్ వీరబాబు 2022వ సంవత్సరంలో ఇరగవరం మండలం అయితంపూడి గ్రామంలో ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. అప్పటి ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. శనివారం తణుకు ఫస్ట్ ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ కేసు విచారణలో నిందతుడి నేరం రుజువుకావడంతో 14 నెలలు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారని సీఐ తెలిపారు. పీపీ హనుమంతరావు ప్రాసిక్యూషన్ నిర్వహించగా, ఎస్‌ఐ డి.ఆదినారాయణ సహకరించారు.

క్లుప్తంగా

మహిళలను గౌరవించాలి



మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: మహిళలను గౌరవప్రదంగా చూడాలని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ.వీరేష్‌కుమార్ కోరారు. విద్యాసంస్థలోని మహిళా గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో శనివారం లైంగిక వేధింపుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. వాక్‌దాన్ కార్యక్రమం సందర్భంగా వీరేష్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు పనిచేసే చోట ఎటువంటి వివక్షకు గురికాకుండా వారికి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేసిందన్నారు. మహిళలను గౌరవప్రదంగా చూడాలన్నదే ఈ చట్టం ముఖ్య కారణమన్నారు. ఎవ్వరైనా వేధింపులకు గురైతే గ్రీవెన్స్‌సెల్ దృష్టికి గాని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



అత్తిలి మండలం ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

17 నుంచి సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు



అత్తిలిలో షష్ఠి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: ఈనెల 17 నుంచి జరిగే అత్తిలి సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాల వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలకు హాజరుకావాలని మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు ఆహ్వాన పత్రికను షష్ఠి కమిటీ సభ్యులు అందజేశారు. షష్ఠి తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో షష్ఠి కమిటీ అధ్యక్షుడు కురెళ్ల ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు మద్దాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

14న టీసీవై క్రిస్మస్ వేడుకలు



తణులో టీసీవై క్రిస్మస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు క్రిస్టియన్ యూత్ (టీసీవై) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలకు విశ్వాసులంతా హాజరుకావాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆకాంక్షించారు. శనివారం తణుకులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరి టీసీవై క్రిస్మస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 14వ తేదీన తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీసీవై కన్వీనర్ మురాల సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మనోజ్‌బాబు, సభ్యులు తలారి గంగాధర్, ఎలిపే శేఖర్, తణుకు పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజేష్, అంబటి శ్యామసాగర్, ఎలిపే నందు పాల్గొన్నారు.

నేడు కాపు కార్తీక వనసమారాధన

తణుకు అర్బన్: కార్తీకమాసం సందర్భంగా ఆదివారం కాపు సంఘం, కాపు యువత ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహిస్తున్నట్లు కాపు సంఘం అధ్యక్షుడు వంటెద్దు ఈశ్వరప్రసాద్ తెలిపారు. సజ్జాపురం ప్రాంతంలోని పెంటపాటి పుల్లారావు నగర్ (అండర్ గ్రౌండ్ బిడ్జి) ప్రాంతంలో నిర్వహించే ఈ వనసమారాధనలో ఉసిరిచెట్టు వద్ద పూజాదికాలకు కాపు సోదర సోదరీమణులంతా హాజరై కాపు వనభోజనాన్ని స్వీకరించాలని కోరారు.

అన్నదాతలను కించపరుస్తున్న చంద్రబాబు

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మంత్రి కారుమూరి



తణుకులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వ్యవసాయం దండగంటూ ప్రతిపక్షనేత చంద్రబాబు మరోసారి తన దుర్మార్గ బుద్ధిని బయటపెట్టారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 30వ వార్డులో శనివారం నిర్వహించిన ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే తాజాగా చంద్రబాబు మాట్లాడిన సభలో అన్నదాతలను కించపరిచే విధంగా మాట్లాడడం బాధాకరమన్నారు. అన్నదాత ధాన్యం పండించకపోతే తినడానికి అన్నం ఎక్కడ నుంచి వస్తుందని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అంత నయవంచకుడు ఎక్కడా ఉండడని దుయ్యబట్టారు. అసలే మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను మరింత కుంగిపోయే విధంగా దుర్భాషలాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎంగా జగన్ వస్తేనే సంక్షేమ పథకాలు...

ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే ఏపీలో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలవుతాయని మంత్రి కారుమూరి అన్నారు. పేదవర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నా, ఇంటి గుమ్మంలోకే అవ్వ తాతలకు పింఛను అందాలన్నా, నాణ్యమైన విద్యవైద్యం పేదలకు అందాలన్నా సీఎంగా జగనే రావాలని స్పష్టం చేశారు. సంక్షేమ ఫలాలు ఇంటి గుమ్మంలోకే అందిస్తున్న వలంటీరు వ్యవస్థను చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లిద్దరూ వ్యతిరేకిస్తున్నారని తాము వచ్చిన వెంటనే ఈ వ్యవస్థని తీసేస్తామని చెబుతుండడం హాస్యాస్పదమన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన జెండా స్తూపాన్ని ఆవిష్కరించి పార్టీజెండా ఎగురవేశారు. అనంతరం వార్డుకు సంబంధించి సంక్షేమ పట్టికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సత్తా కృష్ణవేణి, కాకినాడ బీసీ సెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, మారిశెట్టి శేషగిరి, గారపాటి సత్యనారాయణ, యారబాటి రామకృష్ణ, ఓజీ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, గుబ్బల సూర్యచంద్రరావు, రేలంగి రాంబాబు, పుల్లెపు సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన



ఈడూరులో రామలింగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: కార్తీకమాసం శనిత్రయోదశి పర్వదినం సందర్భంగా అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వేంచేసియున్న రామలింగేశ్వరస్వామికి లక్షబిల్వార్చన నిర్వహించారు. చేకూరి మురళీకృష్ణంరాజు, స్వరాజ్యలక్ష్మి దంపతులచే, ఆలయ అర్చకులు సన్నిధిరాజు సాయికుమార్ ఆధ్వర్యంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, సహస్ర కుంకుమ పూజ, జ్యోతిర్లింగార్చన సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆలయాల నిర్మాణాలతో పెంటపాడుకు ఆధ్యాత్మిక శోభ



అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆలయాల నిర్మాణంతో పెంటపాడు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుందని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పెంటపాడు మండలంలో వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా శ్రీ గౌరీ దేవి అమ్మవారి ఆలయ వార్షిక మహోత్సవంలో భాగంగా శనివారం అన్న సమారాధన నిర్వహించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి మంత్రి సత్యనారాయణ పూజలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గౌరీ దేవి అమ్మవారి ఆశీస్సులు, దయ గ్రామ ప్రజలందరికి ఉండాలని పేర్కొన్నారు. పెంటపాడు పరిధిలో వివిధ ఆలయాలకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిధులు అందజేసినట్లు తెలిపారు. త్వరలో ఆలయాలు దివ్య క్షేత్రాలుగా విరాజిల్లుతాయన్నారు. ఐక్యంగా ఉంటూ అభివృద్ధికి కృషి చేద్దామని, తన తరుపున సంపూర్ణ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, రెడ్డి సూరిబాబు, దాసరి హైమావతి, గుండుమోగుల సాంభయ్య, కైగాల శ్రీనివాస్, చెన్నా జనార్ధనరావు, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, బొడ్డు సాయిబాబా, కైగాల శ్రీను, జామి కృష్ణ, బి.వెంకట్రావు, పసల అచ్యుతం, మైలవరపు పెద్దబాబు, వెలమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం రావిపాడులోని నూతన కనక దుర్గమ్మ ఆలయాన్ని ఉప ముఖ్యమంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



తణుకులో దీక్ష చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

తణుకు టౌన్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రభుత్వాన్ని కోరారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం అగ్రి గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకు కోర్టు ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ అగ్రి గోల్డ్ సంస్థకు రూ. 30 వేల కోట్ల విలువైన ఆస్తులున్నాయని, వాటిని ఉపయోగించి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ తిరుపతిరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సీపీఎం పీవీ ప్రతాప్, కాంగ్రెస్‌నాయకుడు డీ రామకృష్ణ, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, ఐద్వా నాయకురాలు ఏ అజయకుమారి, అసోసియేషన్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి వై నాగలక్ష్మి, తణుకు బ్రాంచి కార్యదర్శి నూనె రామ శ్రీను, కొండయ్య, సాదే సామ్యూల్ రాజు, నాగిరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



తణుకులో అంతర్జాతీయ తెలుగు మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించుకోవడం మంచి పరిణామమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి అన్నారు. తణుకు మునిసిపల్ కార్యాలయంలో శనివారం ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రతినిధుల సమక్షంలో వచ్చేనెల 5,6,7 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే ఈ కార్యక్రమం జయప్రదం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ కమిటీ తణుకు సభ్యులు సీహెచ్ సుధాకర్, బి.విద్యాకాంత్, ఐ.రాజగోపాల్, ఎన్‌వీ రామారావు, కె.రామచంద్రరశర్మ పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 1265 కేసుల పరిష్కారం



తణుకు: న్యాయస్థానాల ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం(టీఓసీ): లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు

తణుకు అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తణుకు కోర్టులో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1265 కేసులు పరిష్కరించారు. 5 బెంచ్‌లుగా నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో రూ. 80 లక్షలు విలువైన 17 సివిల్ కేసులతో పాటు క్రిమినల్ 290, ప్రీలిటిగేషన్ 44, బెంచ్‌కోర్టు కేసులు 914 పరిష్కరించినట్లు న్యాయమూర్తులు వివరించారు. 1వ బెంచ్‌కు నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి, 2వ బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, 3వ బెంచ్‌కు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, 4వ బెంచ్‌కు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్, 5వ బెంచ్‌కు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఏవీ నాగరాజు, అడ్వకేట్ మెంబర్లుగా ఎం.సుబ్బయ్య, కె.మునిస్వామి, డీఎస్ఎస్ రెడ్డి, ఎస్‌కే మోతీ, శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీ శరత్ రాజకుమార్, అడిషినల్ పీపీ రంగాచార్యులు, తణుకు, రూరల్, పెనుగొండ సీఐలు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లోక్ అదాలత్‌లతో కక్షిదారులకు విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు అన్నారు. పట్టణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను కోర్టు ఆవరణలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్య కిరణ్ శ్రీ, మొదటి అదనపు జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ అరుంధతి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొవ్వూరి అప్పిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అన్ని రకాల క్రిమినల్, సివిల్ కేసులను రాజీ చేసుకోవడం వల్ల కోర్టు నుంచి బయిటకు వచ్చిన తరువాత ఇరుపక్షాల ఆనందంగా ఉంటారని, రాజీ మార్గమే రాజ మార్గం అన్నారు. క్రిమినల్ కేసుల్లో కాంపౌండింగ్ కేసులు రాజీ చేసుకోవడం, కేసుల నుంచి విముక్తి పొందవచ్చునని చెప్పారు. రాజీ జరిగిన కేసుల్లో సత్వరమే కోర్టు ఫీజు రిఫండ్ సర్టిఫికెట్ కూడా అవార్డు కాపీతో పాటు రాజీపడిన కక్షిదారులకు ఇస్తారని చెప్పారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్, ఎక్సైజ్, ఎంసీ, ఈపీ, ఓఎస్, ఏటీసీ, ఐపీ, హెచ్‌ఎం ఓపీలు, ఎన్ఐ యాక్ట్‌ల, బెంచ్ కోర్టు కేసులు, బీఎస్ఎన్ఎల్ తదితర వివిధ 644 కేసులకు గాను 2 కోట్లు 56 లక్షల 59 వేలు పరిష్కారం చూపారు. న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా వీరతాత



సరెళ్ల వీరతాతను అభినందిస్తున్న రాష్ట్ర నాయకులు

తణుకు టౌన్: తణుకు మండల పీఎంపీ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా తేతలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సరెళ్ల వీరతాత ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కార్యదర్శి ఎస్ రమేష్ బాబు తెలిపారు. శనివారం సాయంత్రం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని మండల పీఎంపీ అసోసియేషన్ భవన్‌లో జరిగిన సమావేశంలో నిర్వహించిన సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు బీ రామకోటిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీబీటీ రాజు, జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాన్, డాక్టర్ సంకు జీవన్, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం జయరామ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు తక్షణమే ప్రారంభించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వలసలు, కరువు నివారణకు ఉపాధి హామీ పనులు తక్షణం ప్రతి గ్రామంలో ప్రారంభించి కష్టజీవులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 14వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాకు తరలిరావాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. సీపీఐ పట్టణ కార్యాలయంలో శనివారం విజయవాడలో నిర్వహించే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.లక్ష్మణరావు, జిల్లా సహాయ కార్యదర్శి ఉల్లింకల జయకృష్ణ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కంకట రత్నకుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, కె.నాగరాజులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక యాత్రదర్శిని బస్సులను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): గూడెం డిపో నుంచి ఆధ్యాత్మిక యాత్రదర్శిని బస్సులను నడుపుతున్నట్లు వాటిని సద్వినియోగం చేసుకోవాలని పట్టణంలో శనివారం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ప్రతి పౌర్ణమికి అరుణాచలం గిరి ప్రదక్షిణ దర్శినీలో భాగంగా శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, శ్రీ మహాలక్ష్మి టెంపుల్‌తో పాటు అరుణాచలం స్వామి దర్శనం చేసుకోవడం ఒక్కరికి టికెట్ చార్జీ రూ.2600లు అన్నారు. వాడపల్లి ఏడువారాల వెంకన్నదర్శినికి పల్లెవెలుగు ఒక్కరికి రూ. 80లు, కోనసీమ శివకేశవ దర్శిని, ముక్తేశ్వరం, కండులేశ్వరం, అప్పనపల్లి, అంతర్వేదిలకు ఒక్కరికి రూ.400లు, ఏకాదశ రుద్ర దర్శినిలో భాగంగా 11 శైవ క్షేత్రాలు ఒక్కరికి రూ.350లు చార్జీలు కేటాయించామన్నారు. ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ఆడుదాం ఆంధ్ర’కు విశేష స్పందన

- ఉత్సాహంగా క్రీడాకారులు
- ఆడుదాం ఆంధ్రలో పాల్గొననున్న 24,568 మంది విద్యార్థులు
- లక్ష్యాలను మించి నమోదైన వైనం
- ఈనెల 15 నుంచి ప్రారంభం



తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర పోస్టర్

ఆడుదాం ఆంధ్రకు సంబంధించి..

	లక్ష్యం	దరఖాస్తులు	క్రీడా ప్రాంగణాలు.
తణుకు	6156	6836	5
తణుకు రూరల్	3192	5747	14
అత్తిలి	4560	6416	10
ఇరగవరం	4788	5569	21

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న ఆడుదాం ఆంధ్రకు తణుకు నియోజకవర్గంలో క్రీడాకారుల నుంచి విపరీతమైన స్పందన వస్తోంది. క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసే క్రమంలో ప్రభుత్వం స్వయంగా నిర్వహిస్తున్న కార్యక్రమం కావడంతో క్రీడాకారులంతా తమ క్రీడా ప్రతిభాపాటవాన్ని చూపించేందుకు తహతహలాడుతున్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ విభాగాలకు సంబంధించి 15 సంవత్సరాలకు పైబడిన బాలురు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పటికే క్రీడా శాఖ నిర్దేశించిన లక్ష్యాలను మించి క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నారు.

ఈనెల 15 నుంచి..

సచివాలయ పరిధిలో మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విడివిడిగా నిర్వహించే ఈ క్రీడాపోటీలు ఈనెల 15 నుంచి వచ్చేనెల 26వ తేదీ వరకు జరగనున్నాయి. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో మొత్తం 21 క్రీడా ప్రాంగణాల్లో 24568 మంది క్రీడాకారులు (బాలురు, బాలికలు) 5 క్రీడా విభాగాల్లో పోటీపడనున్నారు. పోటీల నిర్వహణకు క్రికెట్ కిట్‌లు, వాలీబాల్స్, బ్యాడ్మింటన్ రాకెట్స్, నెట్స్ వంటి క్రీడా పరికరాలు ఇప్పటికే ఆయా సచివాలయాలకు చేరాయి. క్రీడాకారులకు అవసరమైన క్రీడాపరికరాలు, అల్పాహారం, భోజనవసతి కూడా ఏర్పాటు చేస్తున్నారు.

క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకే



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడా పోటీలకు క్రీడాకారుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. క్రీడా శాఖ నిర్దేశించిన లక్ష్యాలను మించి అన్ని విభాగాల్లోను క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రీడా పోటీలకు పట్టణంలో 5 క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేస్తున్నాం.

– టీవీ రమణ, మున్సిపల్ కమిషనర్, తణుకు

నగదు బహుమతులు ఇవ్వడం శుభపరిణామం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీల్లో క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చూపించడమే కాకుండా ప్రభుత్వం నగదు బహుమతులు కూడా అందిస్తుండడం శుభపరిణామం. క్రీడా పరికరాలు కూడా రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చడం గమనార్హం.

– సంకు సూర్యనారాయణ, ఆడుదాం ఆంధ్ర తణుకు మండల కోఆర్డినేటర్

ఉత్సాహంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు



‘ఆడుదాం ఆంధ్ర’ పోటీలకు క్రీడాకారులు ఎంతో ఉత్సాహంతో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఈ పోటీలను రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి నిర్వహించడం శుభపరిణామం. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు తమ సత్తా చూపించే అవకాశంతో పాటు పైస్థాయికి చేరే వెసులుబాటు ఉంటుంది.

– కె. బాబూరావు, వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు

చాలా సంతోషంగా ఉంది



ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు చాలా సంతోషంగా ఉంది. నేను ఖోఖో పోటీల్లో పాల్గొంటున్నాను. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఈ క్రీడా పోటీలు మండల స్థాయి నుంచి ఏకంగా రాష్ట్ర స్థాయి వరకు ఒకే ఈవెంట్‌గా నిర్వహించడం సంతోషంగా ఉంది. క్రీడాకారులంతా ఆడుదాం ఆంధ్రలో ఎప్పుడు పాల్గొంటామా అని ఎదురుచూస్తున్నారు.

– కె.శ్రీహర్ష, క్రీడాకారుడు, గోటేరు